బుచ్చిబాబు ఆ రోజే ఆఫీసులో జాయిన్ అయ్యాడు. మోహన్ బుచ్చిబాబుని పరిచయం చేసాడు. ఆఖరుగా మేనేజర్ మంగారావ్ క్యాబిన్‌లోకి తీస్కెళ్ళాడు మోహన్.

"ఎవరు! కస్టమరా?" బుచ్చిబాబు వంక చిరాగ్గా చూస్తూ మోహన్‌ని అడిగాడు మంగారావ్.

"కాదు సార్! మన ఆఫీస్‌కి హైదరాబాద్ నుండి ఆర్డర్ పడింది కద్సార్... బుచ్చిబాబుని? అతను సార్... ఈ వేళ జాయిన్ అయ్యాడు.." చెప్పాడు మోహన్.

"ఓ.... బుచ్చిబాబు ! వెల్‌కం-వెల్‌కం! రా కూర్చో"

"థాంక్యూ సార్!" అంటూ మేనేజర్ మంగారావ్ ముందు కూర్చున్నాడు బుచ్చిబాబు .

"హత్తెరి! కూర్చోమనగానే కూర్చుండిపోయావే? నువ్వేమయినా కష్టమర్‌వా కూర్చోవడానికి?" సీరియస్‌గా చూస్తూ ప్రశ్నించాడు మంగారావు.

"మీరే కద్సార్ కూర్చోమన్నారు?" బిక్కమొహం వేస్కుని నిలబడుతూ అన్నాడు బుచ్చిబాబు .

"ఓహో! అలాగా!" బుర్రకాయ్ ఊపి మోహన్‌తో "నువ్వు కూర్చోవోయ్" అన్నాడు మంగారావు.

"పర్లేదు సార్" అన్నాడు మోహన్ నిలబడే.

"చూశావా? అలా అనాలి. అంతేగాని బాస్ మాటవరసకి కూర్చో మని అనగానే టింగురంగా అని కూర్చోకూడదు"

"అలాగే సార్!" అన్నాడు బుచ్చిబాబు వినయంగా.

"సార్...ఇతను కష్టమర్ కాద్సార్!" అన్నాడూ మోహన్.

"హత్తెరికి అవును కదూ? సరే ఇతన్ని అసిస్టెంట్ మేనేజర్ దగ్గరికి తీస్కెళ్ళు "

"అలాగే సార్" అన్నాడు మోహన్.

"ప్రస్తుతానికి నువు అసిస్టెంట్ మేనేజర్ ఏపని చెపితే అది చెయ్యవోయ్" బుచ్చిబాబుతో అన్నాడు మంగారావు.

"అలాగే సార్" బుర్రకాయ్ ఊపాడు బుచ్చిబాబు.

"హత్తెరి! నువ్వు బుర్రకాయ్ భలేగా ఊపుతావోయ్! ఊ...ఊ... ఇంకవెళ్ళి మీ పనులు చూస్కోండి"

ఇద్దరూ క్యాబిన్‌లోంచి బయటికి వస్తుండగా వెనుకనుండి మేనేజర్ మంగారావు "హత్తెరికి కస్టమర్ అనుకున్నా" అనడం బుచ్చిబాబుకి వినిపించింది.

"మాట్లాడితే కస్టమర్ అంటాడేం సిల్లీగా? ఏంటసలు?" మోహన్‌కి అడిగాడు బుచ్చిబాబు .

"అదా? మన బాస్ బాగా లంచాలు గుంజే మనిషిలే? మన ఆఫీసుకి ఏదయినా పనిమీదవచ్చి అతనికి లంచాలిచ్చేవాడు అతని దృష్టిలో కష్టమర్ అన్నమాట!" చెప్పాడు

మోహన్.

"ఈ హత్తెరిగాడు ఒట్టి సిల్లీ ఫెలోలా వున్నాడే!" అన్నాడు బుచ్చిబాబు బుగ్గలు నొక్కుకుంటూ.

సాయంత్రం అయిదు.

బుచ్చిబాబు టేబుల్‌మీది ఫైల్స్ సర్ది ఇంటికెళ్ళడానికి లేచాడు.

"నేను ఎనిమిదిగంటలకల్లా మీ ఇంటికి క్యారియర్ తీసుకుని వస్తానోయ్" అన్నాడు ప్రక్క సీట్లోనే కూర్చునివున్న మోహన్.

"అబ్బే! ఎందుకురా నీకనవసరంగా శ్రమ! ఏదో రాత్రే ఈ ఊరు వచ్చాం కాబట్టి ఉదయం కాఫీ, భోజనం ఏర్పాట్లు చేశావ్ బాగానేవుంది. ఇహ ఇక్కడినుండైనా మా ఏర్పాట్లు మేం చూసుకోపోతే చాలా సిల్లీగా వుంటుంది" అన్నాడు బుచ్చిబాబు .

"ఫర్వాలేదులేవోయ్ ఈ ఒక్కపూటకి మాకే శ్రమ లేదులే! రేపటినుండి మీ అరేంజ్‌మెంట్స్ మీరు చేసుకోండి"

"అబ్బే...వద్దు నేను ఇప్పుడు ఇంటికి కావాల్సిన సామాన్లన్నీ కొనుక్కుని వెళ్తున్నా! ఈ పూట కూడా మీకు శ్రమ కలిగిస్తే సీత కోప్పడుతుంది" అన్నాడు బుచ్చిబాబు.

"అబ్బో....పెళ్ళాం చెప్పుచేతల్లో బాగానే వున్నావన్నమాట!" అన్నాడు మోహన్ పకపకా నవ్వుతూ.

సీత నా పెళ్ళాం కాదు బాబోయ్ అని బుచ్చిబాబుకి గట్టిగా అరవాలని అనిపించింది. తను చెప్పడం కన్నా మెల్లిగా వాళ్ళంతట వాళ్ళే తెలుసుకుంటారు అనుకున్నాడు బుచ్చిబాబు .

0 0 0

బుచ్చిబాబు ఇంటికి తెచ్చిన సామాన్లు చూసి సీత నెత్తిమీద చేతులు ఉంచుకుని "హారి భగవంతుడా" అంది బాధగా.

బుచ్చిబాబు తెల్ల మొహం వేసుకుని చూశాడు.

"ఏం? సరుకులు చాల్లేదా?" మెల్లగా అడిగాడు బుచ్చిబాబు.

"బాగానే వున్నాయిగాని నీకు ఏవేవి ఎంతెంత కావాలో కూడా తెలీదా?" అడిగింది సీత.

"ఏం? ఇప్పుడేమైందని?"

"బియ్యం రెండు కేజీలు తెచ్చావ్, చక్కెరేమో పదికేజీలు తెచ్చావ్ పసుపు కిలోనా? లవంగాలు పావు కిలో, కందిపప్పు చటాకా? ఆవాలు కిలో ఎందుకూ? ఇలా ఎవరయినా తెస్తారా?"

"పోనీ ఏవేవి ఎంతెంత కావాలో నువ్వే లిస్టు రాసి ఇవ్వాల్సింది".

"నాకేం తెలుసు నువ్వు మరీ ఏమీ తెలీని సన్నాసివని?"

“నేను సన్నాసినా? ఊర్కే సిల్లీగా వాగకు” కోపంగా అన్నాడు బుచ్చిబాబు .

“ఏంటీ అరుస్తున్నావు నేనేం నీ పెళ్ళాన్నికాదు” మొహం చిట్లించి అంది సీత.

“అవును కదూ?”

బుచ్చిబాబు నాలుక కొరుక్కున్నాడు.

“సారీ సీత! ఇన్నాళ్ళూ నాన్న తెచ్చిపెడితే అమ్మ వండి పెడితే తిన్నానుకదా! అందుకే నాకేమీ తెలీదు.”

“ఈ కూరగాయలు కూడా అలాగే తెచ్చావు. ఓ రెండు బంగాళా దుంపలు, అర్ధపావు వంకాయలు, కిలో పచ్చిమిరపకాయలు, అరకిలో అల్లం...” నెత్తి కొట్టుకుంటూ చెప్పసాగింది సీత .

“అబ్బో! సంసారం చెయ్యడానికి సిల్లీగా చాలా సంగతులు తెలిసుండాలన్నమాట?” అనుకున్నాడు బుచ్చిబాబు.

## 14

ఏకాంబరం ఆ ఇంటి ముందు అగాడు.

“కరెక్ట్ ఇదే ఆ కిల్లారి కిత్తిగాడి ఇల్లు” అనుకున్నాడు మనసులో.

అది నటరాజన్ ఇల్లు. నటరాజన్ అంటే హెడ్డాఫీసులో పర్సనల్ డిపార్టుమెంటుతో స్టాఫ్‌కి సంబంధించిన ట్రాన్స్‌ఫర్ ప్రమోషన్స్ చూసే ఎగ్జిక్యూటివ్. బుచ్చిబాబు ట్రాన్స్‌ఫర్ చేయించుకోడం కోసం తనకిచ్చిన సలహా చాలా వింతగా సిల్లీగా అనిపించింది ఏకాంబరానికి.

ఓ పాత న్యూస్ పేపర్ తీసుకెళ్ళి మినిస్టర్ మిన్నారావుకి చూపించడం, అతను వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయించడం ఏంటి? అబ్సర్డు! అనుకున్నాడు.

అందుకే నటరాజన్‌ని కలిసి తన ట్రాన్స్‌ఫర్ గురించి ప్రయత్నించాలని అనుకున్నాడు.

ఇదివరకు తన ట్రాన్స్‌ఫర్ గురించి హెడ్డాఫీసులో ప్రయత్నించాడు గాని కాలేదు, అందుకే ఈసారి డైరెక్టుగా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అయిన నటరాజన్‌ని కలసి తన బాధలు చెప్పుకుని ట్రాన్స్‌ఫర్ కోసం అడుగుదామని ఆఫీసునుండి డైరెక్టుగా నటరాజన్ ఇంటికి వచ్చాడు ఏకాంబరం .

కాంపౌండ్‌లోంచి లోపలికి వెళ్ళి “ఈ కిల్లారికిత్తుగాడు ఆఫీసునుండి ఇంటికి వచ్చాడో లేడో” అనుకుంటూ డోర్ బెల్ నొక్కాడు.

నాలుగు క్షణాల తరువాత తలుపు వెనకాల నుండి “జన్...నటరాజన్? ఎవరు?” అని వినిపించింది.

“బరం.... ఏకాంబరం ” అని జవాబు చెప్పాడు ఏకాంబరం నటరాజన్ ఇంట్లో వున్నందుకు సంతోషిస్తూ.

ఆ మాట వింటూనే తలుపులు తెరుచుకున్నాయి.

“ఓ.... నువ్వాప్పా? రా రా....” అన్నాడు నటరాజన్.

ఇద్దరూ వరండాలో కూర్చున్నారు.

“ఎన్నసామీ సమాచారం ? మీ ఆఫీసు ఎట్లా వుంది?” అడిగాడు నటరాజన్.

ఏకాంబరంకి చాలా సంతోషం వేసింది. నటరాజన్ బాగానే రిసీవ్ చేసుకుని మాట్లాడుతున్నాడు. తన ట్రాన్స్ఫర్ గురించి రిక్వెస్ట్ చేస్తే ఒప్పుకోవచ్చు. నటరాజన్ కిల్లారి కిత్తిగాడేమో అనుకున్నాడు గానీ...ఫర్వాలేదు. అతను డింగాల డిప్పే!

“ఎన్నసామీ? ఆఫీసు ఎట్లా వుంది అని అడిగితే సోల్లకుండా పైత్తికారి మాదిరి సూస్తా వుండావే!” అన్నాడు నటరాజన్ తననే గుడ్లప్ప చెప్పి చూస్తున్న ఏకాంబరం వంక ఆశ్చర్యంగా చూస్తూ.

తన ఆలోచనల్లో మునిగిపోయిన ఏకాంబరం ఉలిక్కిపడ్డాడు.

“ఆఫీసా సర్! బాగుంది సార్........ చాలా బాగుంది” అన్నాడు.

“అది మాకు తెలుసులే అప్పా! ఇప్పుడు ఏమి సమాచారం మీద వస్తివి?” అన్నాడు కళ్ళెగరవేస్తూ......

“అంటే మరేమో సార్....మా ఆఫీసు నుండి బుచ్చిబాబు అనే అతను విజయవాడకి ట్రాన్స్ఫర్ అయ్యాడు సార్! అతన్ని మేము రిలీవ్ కూడా చేసేశాం సార్”

“బుచ్చిబాబు? రొంబ ఇన్ఫ్లుయన్స్ దా ఇరికి! పై నుండి మొట్టికాయల్ దా మాకు కొట్టించి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడే............ హ మురుగా!”

“అవునాసార్. వాడంతే సార్. కిల్లారికిత్తిగాడు. అందుకే వాడితో లేనిపోని గొడవేందుకులే అని వెంటనే రిలీవ్ చేసేశాను సార్”

“మంచి పని చేస్తివి. లేదు నీకుడా మొట్టికాయల్ మొట్టిస్తుడు వాడు! సరి ఇప్పుడో పైత్తికారి గురించి మనము యోచన ఎందుకు సేయవలె. నువ్వు వచ్చిన పని చెప్పుడు” అన్నాడు నటరాజన్.

“బుచ్చిబాబు రిలీవ్ అయిపోయాడు కద్సార్ అతని ప్లేస్లో ఓ సబ్స్టిట్యూట్ని పోస్ట్ చేయించమని అడగటానికి వచ్చాను సార్! లేకపోతే అతని సీట్లో పనంతా పెండింగ్ పడిపోతుంది సార్” ముందుగా తన ప్రాబ్లెం కాకుండా ఆఫీసులోని వేరే ప్రాబ్లెం గురించి మాట్లాడి తర్వాత తన విషయం గురించి మాట్లాడ్దామని అనుకున్నాడు ఏకాంబరం.

“ఇందమాదిరి సిన్న విషయం గురించి నా దగ్గరకు ఎవడైనా వస్తుడా?” ఏకాంబరం వంక ఆశ్చర్యంగా చూసాడు నటరాజన్.

“ఇది విషయం నువ్వుదా స్టాఫ్ డిపార్ట్మెంటుకు పోయి సెప్పుసామీ” అన్నాడు.

“వాళ్ళకి కూడా చెప్తాను సార్. కానీ ప్రస్తుతం నేను వేరే పని మీద వచ్చాను సార్. ఎలాగూ మీ దగ్గరకు వచ్చాను కదా అని బుచ్చిబాబు ప్లేస్లో సబ్స్టిట్యూట్ అడిగాను సార్” వినయంగా అన్నాడు ఏకాంబరం.

“సరి  సరి......... నువ్వుదా ఏమి పని మీద వస్తివో చెప్పిపూడుస్సము”

“సార్ నేను ఇక్కడ చాలా కాలంగా పని చేస్తున్నాను సార్ అసలు మా సొంత ఊరు గుంటూరు సార్. నేను ఎప్పటినుండో గుంటూరుకి ట్రాన్స్ఫర్ అడుగుతున్నాను సార్. ఈ హైదరాబాద్ నీళ్ళు నాకు పడడటం లేదు సార్. ఇక్కడి ట్రాఫిక్కు, మత కలహాలు, కత్తి పోట్లు, పొల్యూషన్......ఏవీ నాకు పడటంలేదు సార్” గుక్క తిప్పుకోకుండా గబ గబా అన్నాడు ఏకాంబరం .

“ఎన్న సామీ? నువ్వు రొంబ సిత్రంగా సెప్తువే? అవి మాకు పడునా? మేముదా కాలక్షేపము సేస్తుము........ నీకుదా ట్రాన్స్ఫర్ కావాలి?” మొహం చిట్లిస్తూ అన్నాడు నటరాజన్.

“సార్........ సార్.....అలా అనకండి సార్. మీరు నామీద దయ వుంచాలి సార్”

“నా దయ కాదప్పా! అందరికీ మురుగా దయ కావాలి! నాకు మద్రాసు ట్రాన్స్ఫర్ కావాలి? నాకు ట్రాన్స్ఫర్ ఎవడు సేస్తుడు? పోప్పా!“

“సార్.....సార్....మీరే కాదంటే ఎలా సార్? మీరు ఎలాగైనా నాకు హెల్ప్ చేయండి సార్” బ్రతిమలాడుతూ అన్నాడు ఏకాంబరం .

“అదే.....పోప్పా! వీలుకాదని సెప్తావుంటే ఎందప్పా ఈ గలాటా? సిలిబిళి బిళీ......సుణక్కి బిక్కి......... పోణ్ణాచ్చి కంఢ్రి” అన్నాడు నటరాజన్ ఏకాంబరం వంక సీరియస్గా చూస్తూ.

“అంటే ఏంటి సాక్” బిత్తరపోయి చూస్తూ అడిగాడు ఏకాంబరం.

“నువ్వుదా కిల్లారికిత్తి, టింగాల తిస్కుమాదిరి సిత్రమైన తిట్లు తిడ్తువని వింటిని. నీకు మాదిరిగానే నాన్దా సిత్రమైన తిట్లు తమిళములో తిడ్తును” గర్వంగా అన్నాడు నటరాజన్.

“ఆ!” నోరు తెరిచాడు ఏకాంబరం .

0 0 0

“ఏవండీ...నేను భరించలేకపోతున్నానండీ పాపం!” పెరుగన్నం కలుపుతూ అంది పార్వతమ్మ.

“ఏం? ఏ వెధవో చేసింది కాదుగా? నువ్వుచ్చిన వంటేగా తింటున్నావ్?” అన్నాడు పర్వతాలరావు  తను కూడా అన్నంలోకి పెరుగేస్కుంటూ.

“అబ్బ! నేనంటుంది అది కాదండి.... మన బుచ్చిగాడిని చూడకుండా నేను ఉండలేకపోతున్నానండీ....”

“అయితే ఏమంటావ్ నీ వెధవ సోది?”

“మనము కూడా విజయవాడకి వెళ్ళిపోయి వాడితోనే ఉందామండీ”

పర్వతాలరావు ఓ సారి పార్వతమ్మని సీరియస్గా చూసి గుబుక్, గుబుక్ మని పెరుగన్నము ముద్దలు నాలుగు మింగి “వీల్లేదు..... మనము ఇక్కడే ఉంటాం ఆ వెధవూరు మనకొద్దు....కావాలంటె ఆ వెధవాయే ఎప్పుడో మళ్ళీ ట్రాన్స్ఫర్ చేయించుకుని ఇక్కడికి వస్తాడు” అన్నాడు.

పార్వతమ్మ కూడా పెరుగన్నము ముద్దలు నాలుగు గుటుక్ గుటుక్ మని మింగింది. అ తర్వాత ఇలా అంది "కానీ వాడిని చూడకుండా ఎలాగండీ వుండేది పాపము?"

"ఆ వెధవ నా పోలికలతోనే ఉంటాడని అంటావ్‌గా? నా మొహం చూస్తూ కూర్చో! ఆ వెధవ పచ్చడేదో ఇలా తగలెయ్" విసుగ్గా అన్నాడు పర్వతాలరావు.

పార్వతమ్మ అంతకంటే విసుగ్గా స్పూన్‌తో గోంగూర పచ్చడి తీసి అతని కంచంలో కొట్టింది.

"ఈ వెధవ్వేషాలంటేనే నాకు మంట" పచ్చడి నాలిక్కి రాస్కుంటూ అన్నాడు పర్వతాలరావు.

"పోనీ మనము విజయవాడకు వెళ్లి ఓ నాలుగు రోజులుండి వస్తేనో?...." అడిగింది పార్వతమ్మ .

"వాడెళ్ళి రెండు రోజులైనా కాలేదు అప్పుడే మనము విజయవాడ వెళ్ళడమేంటి నీ బొంద?"

"వాడిని చూస్తే తప్ప నాకు తిండి సహించేలా లేదండి పాపం "

"అవునవును---- చూస్తూనే ఉన్నావుగా! ఇప్పుడేగా నువ్వు కంచము కూడూ గుటుక్ గుటుక్ మని మింగావ్ ! ఇంకా విషయం గురించి నన్ను అడక్కు....నోర్మూస్కుని కూర్చో"విసుగ్గా చూస్తూ అన్నాడు పర్వతాలరావు.

పార్వతమ్మ మూతిని ముప్పై వంకర్లు తిప్పింది.

*  *  *

అక్కడ .......

విజయవాడలో......

"అబ్బో........ నేను సిల్లీగా ఏమో అనుకున్నాగానీ నీకు వంట బాగానే వచ్చే" కంచములో చెయ్యి కడుక్కుంటూ అన్నాడు బుచ్చిబాబు సీతతో.

"అదేమైన బ్రహ్మవిద్యా? కారము, ఉప్పూ సరిగ్గా వేసి వేయించేస్తే చాలు! అయినా పాపం నువ్వు వంటలో బాగనే సాయము చేసావ్ కూరగాయలు తరిగిపెడ్తూ!" తనుకూడా కంచములో చెయ్యి కడుక్కుంటూ నవ్వుతూ అంది.

"సాయం చెయ్యక! అదే నేను నీకు తాళి కట్టిన భర్త అయితే ఒసేవ్,ఏమేవ్ అంటూ సిల్లీగా నీకు ఆర్డర్లు జారీ చేయడమేగానీ సాయం, గీయం జాన్తానయ్....." నవ్వుతూ అన్నాడు బుచ్చిబాబు .

"ఊ.....నీ గోల నీదేకదా? నీగోల పడలేకేకదా పెళ్ళీగిళ్ళీ లేకుండా ఇప్పుడు ఇక్కడికి నీతో వచ్చి ఉన్నాను?" సీత ఎంగిలి కంచాలు ఎత్తి వంట గదిలోని సింక్ దగ్గరకు వెళ్తూ అంది.

"సరేగానీ సగము గిన్నెలుతోమి నువ్వు ఇటొచ్చెయ్..... మిగతా సగము నేను తోమేస్తా"

"వద్దు మగాళ్ళు అంట్లు తోమితే బాగుండదు."

“ఇదిగో.... అలాగే మగాళ్ళని సిల్లీగా నెత్తిన ఎక్కించుకుంటారు మీ ఆడవాళ్ళు” అన్నాడు బుచ్చిబాబు అక్కడి నుండి లేచి హాల్లోకి వెళ్తూ.

పావుగంటలో అంట్లు తోమి వంటిల్లు సర్ది హాల్లోకి వచ్చింది.